RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 194 | జూన్ 28, 2025 | వెల : రూ.3-00



29న నిజామాబాద్‌కు అమిత్ షా రాక

2లో..

# సైబర్ నేరాలపై అవగాహన అవసరం



– సీఐ సుజాత

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**

సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని షీ టీమ్ సీఐ సుజాత అన్నారు. శుక్రవారం నగరంలోని సెంట్ పీటర్స్ ఫార్మసీ కాలేజీలో డ్రగ్స్, సైబర్ నేరాల పై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుజాత మాట్లాడుతూ ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్‌లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉంటుందని అన్నారు. ఇటీవల కాలంలో మహిళలు, పిల్లలను టార్గెట్ చేసుకుని సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. ఇంటర్నెట్‌ను

మిగతా 4వ పేజీలో..

### రెవెన్యూ సదస్సుల

# దరఖాస్తులు పరిష్కారమయేనా..!

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**



జిల్లాలో భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తులతో తాసిల్దారులకు, రెవిన్యూ ఇన్స్పెక్టర్లుకు తలనొప్పిగా మారింది. ఈనెల 3 నుండి ప్రారంభమైన రెవెన్యూ సదస్సుల ద్వారా జిల్లా వ్యాప్తంగా 42,534 దరఖాస్తులు వచ్చాయి. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా మిస్సింగ్ సర్వే నెంబర్లు 14803 జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరాయి. దీంతో తహసిల్దార్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు దరఖా

మిగతా 4వ పేజీలో..



# రైతుల కోసం న్యాయపోరాటం

- కృష్ణా గోదావరి నది జలాలలో న్యాయం జరిగే వరకు..
- ఇరిగేషన్ శాఖ పై గత పాలకుల నిర్లక్ష్యం
- ఫలితంగా ఏడాదికి రూ.16 వేల కోట్ల మిత్తి చెల్లింపులు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**వేద న్యూస్, సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి:**

కృష్ణ, గోదావరి జలాల పంపకంలో గత పాలకుల అశ్రద్ధ వల్ల తెలంగాణ రైతాంగానికి అన్యాయం జరిగిందని, దానిని సరి చేసేందుకు తాము పోరాడుతున్నామని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పాలకీడు మండలం పాలకీడు మండలం జానపాడు గ్రామంలో కృష్ణ నది పై నిర్మిస్తున్న జవహర్ జానపాడు లిఫ్ట్ ఇరిగేషన్,బెట్టేతండా గ్రామంలో మూసీనది పైన నిర్మిస్తున్న బెట్టేతండ స్కీం పనులను ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత పాలకులు పదేళ్ల నిర్లక్ష్యం చేయటంతో కృష్ణ నదిలో 811 టి యమ్ సి లలో ఆంధ్ర కి 599 టి యమ్ సి లు, తెలంగాణాకి 299 టి యమ్ సి లకి వ్రాత పూర్వకంగా ఒప్పుకున్నారని.. కానీ, తాము వచ్చాక నది పరివాహక ప్రాంతం,ఆయకట్టు, జనాభా ను పరిగణనలోకి తీసుకొని నీటి కేటాయింపులు చేయాలనీ పోరాడుతున్నామని అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మడి హట్టి వద్ద 38000 కోట్లతో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్ ని ప్రారంభిస్తే.. కమీషనలకి కక్కుర్తి పడి లక్ష కోట్ల రూపాయలతో కాళేశ్వరం పేరుతో నిర్మిస్తే.. మూడేళ్ళకే కూలిపోయిందని ధ్వజమెత్తారు. అదే తుమ్మడిహట్టి వద్ద ప్రాజెక్ట్ నిర్మిస్తే 62000 కోట్ల రూపాయలు మిగిలేవి అని.. వాటితో ఎస్ ఎల్ బి సి, డిండి, పాలమూరు రంగారెడ్డి, భీమా, నెత్తంపాడు, కోయిల సాగర్, దేవాదుల, సీత రామ సాగర్, గౌరేల్లి, లాంటి ప్రాజెక్టు లు పూర్తి అయి.. నేడు తెలంగాణ సస్యాశ్యామలం అయ్యేదన్ని స్పష్టం చేశారు. ఇరిగేషన్ శాఖపై వారు చేసిన తప్పిదాల వల్ల నేడు మేము 16000 కోట్ల రూపాయలు వడ్డీ చెలిస్తున్నామని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి 27,500 కోట్లు, సీతారామ ప్రాజెక్ట్ 10,000 కోట్లు ఖర్చు చేసిన ఒక ఎకరం కొత్త ఆయకట్టు లోకి

మిగతా 4వ పేజీలో..

### మావోయిస్టుల లేఖపై

# స్పందించిన సీతక్క



- నా మూలాలను మరిచిపోలేదు
- ఎవరూ ఆదివాసీల జోలికి వెళ్లడం లేదని మంత్రి సీతక్క వివరణ

**వేద న్యూస్, ములుగు :**

ఆదివాసీల వ్యవహారంలో మావోయిస్టులు తనకు సంధించిన లేఖపై తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క స్పందించారు. తన మూలాలను తానెప్పుడు మరిచి పోలేదన్నారు. శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగులో మంత్రి సీతక్క విలేకర్లతో మాట్లాడుతూ.. జీవో 49ను తాను వ్యతిరేకించానని గుర్తు చేశారు. మంత్రిగా ఉండి తమ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలతో సమావేశం పెట్టానని వివరించారు. ఆ క్రమంలో ఆదివాసీల జోలికి వెళ్లవద్దని అటవీశాఖ అధికారులకు మంత్రి కొండా సురేఖతోపాటు తానూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. కొందరు రాజకీయ నాయకుల ప్రోద్భలంతో ఒకరిద్దరు అటవీశాఖ అధికారులు తప్పా.. ఎవరూ ఆదివాసీల జోలికి వెళ్లడం లేదని మంత్రి సీతక్క వివరణ ఇచ్చారు. అయితే ఎవరు మాట్లాడినా నిజాలు మాట్లాడాలంటూ మావోయిస్టులకు ఆమె పరోక్షంగా సూచించారు ఆదివాసీల వ్యవహారంపై ఇవాళ(శుక్రవారం) ఉదయం మంత్రి

మిగతా 2వ పేజీలో..

### ఇందిరమ్మ ఇండ్లు

# అర్హులకు ఇవ్వాలి



– బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు ఇవ్వాలని కోరుతూ..ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీసు ఎదుట బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు ఇల్లు ఇవ్వకుండా కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకు, కాంగ్రెస్ నాయకులకు మాత్రమే ఇల్లు ఇవ్వడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్లలో కేంద్రం వాటా ఎంత ఉంది? రాష్ట్ర ప్రభుత్వం వాటా ఎంత ఉంది? అనేది చెప్పాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పైన ఉందన్నారు. రూ.2లక్షల 65 వేలు ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం ద్వారా లబ్ధిదారునికి వస్తోందని చెప్పారు. మిగతా

మిగతా 4వ పేజీలో..



# ఏఎస్ఐలకు ఎస్ఐ లుగా పదోన్నతి

- పోలీస్ శాఖ గౌరవాన్ని పెంచే విధంగా పనిచేయాలి
- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

పదోన్నతి పొందిన ఎస్ఐలకు పదవితో పాటు బాధ్యత కూడా పెరుగుతుందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ అన్నారు. క్రమ శిక్షణతో, బాధ్యతగా పని చేస్తూ ప్రజల మన్ననలు పొందాలని పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాల యంలో వివిధ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఆరుగురు ఏఎస్ఐ లకు, ఎస్.ఐలుగా పదోన్నతి పొందిన సందర్భంగా జిల్లా ఎస్పీ స్టార్ లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదోన్నతితో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని అన్నారు. పోలీసు స్టేషనుకు వచ్చే పిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడుతూ సమస్యను పరిష్కరించే దిశగా పనిచేయాలని సూచించారు. తమకు అప్పగించిన విధులను క్రమ శిక్షణతో బాధ్యతతో పని చేయాలని అన్నారు.అప్పుడే పోలీస్ శాఖకు గౌరవం వస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు సంఘం అధ్యక్షుడు జయరాజు, పదోన్నతి పొందిన ఎస్.ఐ లు తదితరులున్నారు.



### బనకచర్లపై రైతులతో కలిసి

# సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం

**వేద న్యూస్, హైదరాబాద్ :**

బనకచర్లపై పీపీటీ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శలు గుప్పించారు. మాజీ మంత్రి మాట్లాడుతూ.. డైవర్షన్ కోసమే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారని మండిపడ్డారు. 2016 ఎజెండా మినిట్స్‌పై రేవంత్ రెడ్డితో చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. ఇరు రాష్ట్రాలు కూర్చుని ప్రణాళికలు సిద్ధం చేసుకుందామని మాత్రమే కేసీఆర్ అన్నారని.. తెలంగాణకు ఆమోదయోగ్యం లేకుంటే ఒప్పుకునేది లేదని 2016 మీటింగ్‌లో ఆయన చెప్పారని గుర్తుచేశారు. బనకచర్లపై కేంద్ర జలశక్తి మీటింగ్‌లో ప్రభుత్వం తెలంగాణ వాదనను గట్టిగా వినిపించాలని డిమాండ్ చేశారు. విషయం లేకనే.. సీఎం రేవంత్ రెడ్డి బూతులు ఎత్తుకున్నారని వ్యాఖ్యలు చేశారు. బేసిన్‌కు బాసిన్‌కు తేడా తెలియని ముఖ్యమంత్రి రేవంత్

మిగతా 4వ పేజీలో..

# జర్నలిస్ట్ మహేందర్ మృతికి "టిడబ్ల్యూజెఎఫ్" సంతాపం




**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

మొన్నటికి మొన్న దత్తురెడ్డి అకాలమరణం మరువకముందే మరో సీనియర్ జర్నలిస్టు హన్స్ ఇండియా వరంగల్ బ్యూరో చీఫ్ ఆడెపు మహేందర్ (55) గురువారం గుండె పోటుతో మృతి చెందటం జర్నలిస్టు సమూహాన్ని శోకసంద్రంలో ముంచింది. ఆడెపు మహేందర్ మృతికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్)బొక్క దయాసాగర్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్ తోపాటు హనుమకొండ జిల్లా అధ్యక్షులు టీవీ రాజు, ప్రధాన కార్యదర్శి అంతడుపుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు దామెర రాజేందర్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధ పడుతూ తుదిశ్వాస విడువటం బాధాకరం. ఆడెపు మహేందర్ హన్స్ ఇండియా దిన పత్రికలో గత పది హేను సంవత్సరాలు గా ఉమ్మడి వరంగల్ బ్యూరో చీఫ్ గా కొనసాగుతు జర్నలిస్టు సమూహాతో పాటు ఈ ప్రాంతంలోని అన్ని వర్గాల ప్రజలకు సుపరిచితుడిగా ఉన్నారు. ఆయన స్వస్థలం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్. తనదైన శైలిలో అనేక పరిశోధనాత్మక కథనాలు రాశారు. హైదరాబాద్, ఖమ్మం జిల్లాలో జర్నలిస్ట్ గా పని చేశారు. ఆయన మృతికి టిడబ్ల్యూజెఎఫ్ సంతాపం ప్రకటిస్తు, వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

# జూన్ 30 వరకు సన్న బియ్యం పంపిణీ

**– జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు**



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

జిల్లాలోని రేషన్ షాప్ డీలర్లు లబ్ధిదారులకు ప్రస్తుతం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యం జూన్ మాసంతో పాటు జూలై, ఆగస్టు నెలలకు గాను మూడు మాసముల సన్నబియ్యం పంపిణీ జూన్ 30వ తారీకు చివరి రోజుగా గడువు ముగుస్తుంది. బియ్యం పంపిణీ విషయంలో తదుపరి ప్రభుత్వం నుండి ఎలాంటి పొడగింపు ఉత్తర్వులు లేనందున డీలర్లు అందరూ మీ గ్రామాలలోని లబ్ధిదారులకు తెలియజేయగలరని కోరారు .అదేవిధంగా లబ్ధిదారులు కూడా మీకు రావలసిన మూడు మాసముల సన్న బియ్యమును ఈనెల అనగా 30.06.2025 వ తారీకు వరకు సంబంధిత డీలర్ షాపులో తీసుకోగలరని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి టి. వెంకటేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## పత్తి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,400

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు కాటన్ విడి పత్తి 22 క్వింటాళ్లు, 2 వాహనాలలో శుక్రవారం రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. గరిష్ట ధర రూ.7,400, మోడల్ ధర రూ.7,400, కనిష్ట ధర రూ.6,500 పలికిందని మార్కెట్ సెక్రెటరీ ఆర్.మల్లేశం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం, ఆదివారం మార్కెట్‌కు సెలవులు కాగా, ఈ నెల 30న (సోమవారం) మార్కెట్ పున: ప్రారంభం అవుతుందని మార్కెట్ సెక్రెటరీ వెల్లడించారు.

## మావోయిస్టుల లేఖపై స్పందించిన సీతక్క

మొదటి పేజీ తరువాయి సీతక్కకు మావోయిస్టులు లేఖ రాశారు. ఈ లేఖలో వారు ఏమన్నారంటే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కీలక మంత్రిగా పని చేస్తున్న మాజీ మావోయిస్టు సీతక్క.. ఆదివాసీల హక్కుల గురించి కనీసం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో ఆదివాసీల హక్కులకు పూర్తి బాధ్యత మంత్రి సీతక్కదేనని స్పష్టం చేశారు. జీవో నెంబర్ 49తో కుమురం భీమ్ జిల్లాలోని 339 ఆదివాసీ గ్రామాలను ఖాళీ చేయించాలని ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. ఈ జీవో 49 కారణంగా రాష్ట్రంలో మూడు జిల్లాలు కనుమరుగవుతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకే జీవో నెం. 49 తీసుకువచ్చారంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఈ జీవోను వెంటనే రద్దు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా, ఈ లేఖపై మంత్రి సీతక్క వెంటనే స్పందించి వివరణ ఇచ్చారు.

## ఆ నీటిని ఉపయోగించకండి

**వేద న్యూస్, డెస్క్:**

భాగ్యనగరంలో 6 చెరువులకు పునరుజ్జీవం కల్పించడం కోసం కృషిచేస్తున్న హైడ్రా, ఆ నీటి వనరుల సమీపంలోని భూగర్భజలాలపై దృష్టిసారించింది. అందులో భాగంగా తొలి ప్రాధాన్యంగా మాదాపూర్ సున్నంచెరువును ఎంపిక చేసుకున్న హైడ్రా, అక్కడి పరిసరాల్లోని భూగర్భజలాలు అత్యంత ప్రమాదకరంగా మారాయని తేల్చింది. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఉపరితల నీటితో పాటు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటి నమూనాలు పరీక్షించారు. ఆ పరిశోధనలో ట్యాంకర్లలోని నీటి నమూనాల్లో సీసం, కాడ్మియం, నికెల్ వంటి భారలోహాలు మోతాదుకు మించి ఉన్నట్లు తేలింది. అవి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) హెచ్చరించింది. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఉండాల్సిన మోతాదు కంటే రెండు, మూడింతలు, 12 రెట్లు అధికంగా ఉండి ప్రజల ప్రాణాలను హరిస్తున్నట్లు పీసీబీ వివరించింది. సున్నంచెరువు చెంత ఏళ్ల తరబడి కొందరు బోరుబావులు తవ్వి, ఆ నీటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మాదాపూర్ పరిసరాల్లోని హాస్టళ్లు, విద్యాసంస్థలు, హోటళ్లు, కాలనీలకు ప్రతి వేసవిలో పెద్దఎత్తున నీటిని సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నీరంతా అత్యంత ప్రమాదకరమని, పీసీబీ గుర్తించినట్లు వెల్లడించిన హైడ్రా, స్థానిక ప్రజలు, హాస్టళ్లలో ఉండే విద్యార్థులు, ఉద్యోగులు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీటిని వినియోగించవద్దని సూచించింది. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఒక లీటరు నీటిలో 0.01 మిల్లీగ్రాముల సీసం వరకూ ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండదని, కానీ సున్నం చెరువు చుట్టూ ఉన్న బోరు నీటిలో 0.073 – 0.122 ఉన్నట్లు పీసీబీ గుర్తించింది. నిర్దిష్ట ప్రమాణాల కంటే 7 నుంచి 12 రెట్లు అధికంగా సీసం ఉన్నట్లు తేల్చింది. ఆ నీరుతాగితే చిన్నారుల మెదడు చురుకుదనంపై ప్రభావం చూపుతుందని, జ్ఞాపిక శక్తి తగ్గడం, రక్తహీనత, బాల్యం, యవ్వన దశలో కిడ్నీలపై ప్రభావం చూపుతుందని పేర్కొంది. రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు, సంతానోత్పత్తిపైనా ప్రభావం చూపుతాయని వైద్యులు చెబుతున్నారని వివరించారు. 2 నుంచి 3 రెట్లు అధికంగా కాడ్మియం, 2 రెట్లు అధికంగా నికెల్ ఉన్నట్లు గుర్తించారు. ఆ నీటిని మరగబెట్టి వినియోగించినా ప్రయోజనం ఉండదని వైద్యులు సూచిస్తున్నారని హైడ్రా హెచ్చరించింది. అందులో ఉండే సూక్ష్మక్రిములు నశించినా భారలోహాలు కరగపోగా మరింత ప్రమాదకరంగా పరిణమిస్తాయని హెచ్చరించింది.

## "ప్రైవేటు" స్కూల్స్, బుక్ స్టాల్స్‌పై చర్యలు తీసుకోవాలి

**– ఏఐఎఫ్ డిఎస్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీకాంత్**




**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలపై బుక్ స్టాల్ యాజమాన్యాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎఫ్ డిఎస్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీకాంత్ కోరారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ జమ్మికుంట పట్టణం లో ఉన్న అన్ని ప్రైవేట్ స్కూల్స్ సిండికేట్ అయ్యారని.. బుక్ స్టాల్స్ యజమానియాలతో ఒప్పందం చేసుకున్నారనీ ఆరోపించారు. బుక్ స్టాల్స్ యాజమాన్యాల దగ్గరికి వెళ్లి తక్కువ ధర ఉన్న పుస్తకాలకు ఎక్కువ ధరలకు విక్రయించేలా ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. 2025-26విద్యా సంవత్సరం మొదలు కాకముందే ఇష్టా రాజ్యాంగ.. వ్యవహరిస్తున్న వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలో ఉన్న బుక్ స్టాల్స్ ను తనిఖీ చేయాలని మండల విద్యాధికారి హేమలతను కోరారు.

## 'కాకతీయ'కు లాభార్జనే ధ్యేయం!

**– విద్యాసంస్థలపై ఆ శాఖ కమిషనర్‌కు సామాజిక కార్యకర్త గట్టు సాయిరాం ఫిర్యాదు**

**వేద న్యూస్, జమ్మికుంట:**



'కాకతీయ' విద్యాస్థంస్థలకు లాభార్జనే ధ్యేయంగా మారిందని సామాజిక కార్యకర్త గట్టు సాయిరాం ఆరోపించారు. జమ్మికుంట పట్టణంలో కృష్ణవేణి విద్య సంస్థ పేరు మీద కాకతీయ బ్రిలియంట్ విద్యాసంస్థ నడుస్తోందని, ఈ విషయమై అనేక సార్లు విద్యాధికారుల దగ్గరకి పోయిన కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. గత 2024- 2025 ఏడాదిలో మొత్తం 698 అడ్మిషన్లు యు-డయాస్ ప్రభుత్వ ఆమోదిత వెబ్‌సైట్‌లో కృష్ణవేణి పాఠశాల పేరు మీద ఉన్నాయని పేర్కొన్నారు. 2025-2026 సంవత్సరంకూడా అదే పాఠశాల అనగా కృష్ణవేణిలో అడ్మిషన్లు నమోదయ్యాయని తెలిపారు. పాఠశాల బోర్డులు, పాఠశాల విద్యార్థుల దుస్తులు, వ్యాన్లు మొత్తం కాకతీయ బ్రిలియంట్ పాఠశాల అని ఉన్నాయని చెప్పారు. ఇంత పెద్ద ఇంత పెద్ద దోపిడీ మోసం జరుగుతోందని, సదరు స్కూల్‌పై పలు మార్లు ఉన్నత అధికారులు జిల్లా కలెక్టర్ కు, జిల్లా విద్యాధికారి కి, స్థానిక ఎంఈఓకు ఫిర్యాదులు చేసినా.. ఆ కంప్లయింట్స్ బుట్టదాఖలవుతున్నాయని ఆరోపించారు. ఈ విషయమై శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌కు పూర్తి సాక్ష్యాధారాలతో కంప్లయింట్ చేసినట్టు సాయిరాం వెల్లడించారు. సదరు పాఠశాలపై చట్ట పరమైన చర్యలు తీసుకొని.. స్కూల్ సీజ్ చేసి విద్యార్థులను మోసం చేసిన కాకతీయ విద్యాసంస్థల యాజమాన్యం పై, వారికి కొమ్ము కాస్తున్న అధికారులపై చీటింగ్ కేసులు నమోదు కోరారు.

## 29న నిజామాబాద్‌కు అమిత్ షా రాక

**– పసుపు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించనున్న కేంద్ర మంత్రి**

**– 29న మధ్యాహ్నం 1 గంటకు బేగంపేట విమానాశ్రయానికి రాక**



వేద న్యూస్, నిజామాబాద్ జిల్లా రైతులు ఎప్పుడెప్పుడని ఎదురు చూస్తున్న పసుపు బోర్డు ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా ఈ కార్యాలయం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమం కోసం ఆయన ఈ నెల 29వ తేదీన నిజామాబాద్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనకు సంబంధించి బీజేపీ వర్గాలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాయి. కేంద్ర మంత్రి అమిత్ షా ఈ నెల 29న మధ్యాహ్నం 1 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ఆయన నేరుగా నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన పసుపు బోర్డు ప్రధాన కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవుతారు. జిల్లా రైతుల చిరకాల డిమాండ్‌గా ఉన్న పసుపు బోర్డు కార్యాలయాన్ని ఆయన అధికారికంగా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు.

## బీఎస్పీ జిల్లా అధ్యక్షులుగా వస్కుల ప్రవీణ్ కుమార్


**వేద న్యూస్, మడికొండ :**



బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ హన్మకొండ లోని హరిత కాకతీయ హోటల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని బి.యస్.పి వరంగల్ ఇంచార్జ్ గా వస్కుల ప్రవీణ్ కుమార్ ను హన్మకొండ జిల్లా అధ్యక్షులుగా నియమించారు. ఈ సందర్భంగా వస్కుల ప్రవీణ్ కూమార్ మాట్లడుతూ బహుజన ఉద్యమాన్ని మరింత నిబ్బద్దతో నిర్వహిస్తానని తెలిపారు. నన్ను జిల్లా అధ్యక్షులు నియమించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఈ కార్యక్రామంలో రాష్ట్ర నాయకులు ఉపేంద్ర సహు, శనిగరపు రాజు, జిల్లా నాయకులు, తదితర నాయకులు పాల్గొన్నారు.

## బీసీలపై కుట్రలు తగవు

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**



– నాగవల్లి మధు

గ్రామాలలో రాజకీయంగా ఎదుగుతున్న బీసీలను చూడలేక రాబోయే స్థానిక ఎన్నికలలో ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని తెలియపరచడంతో కొంతమంది అగ్రకులాలకు చెందినవారు బీసీ కులాలపై పనిగట్టుకుని కుట్రలు చేస్తున్నారని వేములపల్లి నాయి బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు నాగవెల్లి మధు ఆరోపించారు. ఇటీవల మొల్కపట్నం గ్రామంలో జరిగినటువంటి సంఘటన అని అన్నారు.శుక్రవారం ఆయన వేములపల్లి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల మొల్కపట్నం గ్రామస్తుడైనటువంటి పేరెల్లి నాగేష్, గ్రామంలోని స్థానిక మహిళకు వ్యక్తిగతంగ చిన్నపాటి గొడవ జరిగితే దానిని కొంతమంది అగ్రకులాలకు చెందిన వారు రాజకీయంగా నగేష్ ఎదుగుదలను చూడలేక పనికట్టుకున్నారన్నారు.ఎలాంటి ఆధారాలు లేకుండా ఇలాంటి నిరాధారణ ఆరోపణలు చేసి రాజకీయంగా ఎదగకుండా చేయాలని చూస్తే బీసీలు ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగవెల్లి నగేష్,శంకర్,రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## బనకచర్లపై రైతులతో కలిసి సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం



మొదటి పేజీ తరువాయి రెడ్డి అంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఒత్తిడితోనే ఎంపీల మీటింగ్ ఏర్పాటు చేశారన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బనకచర్ల కార్పోరేషన్ ఏర్పడలేదని, టెండర్లు పిలివలేదని చెప్పుకొచ్చారు.చేతులు కాలినాక.. ఆకులు పట్టుకున్న చందంగా బీజేపీ తీరుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు నష్టం జరగకముందే బనకచర్లను ఆపేలా.. కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బనకచర్లపై రైతులతో కలిసి సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు.

# సంపాదకీయం

## కార్పొరేట్ విషవలయంలో విద్య, వైద్యం

కేంద్ర–, రాష్ట్ర ప్రభుత్వాలు పలు రకాల విద్య –వైద్య సంస్థలను నిర్వహిస్తున్నాయి. వాటి నిర్వహణకు సరిపడా నిధులు మాత్రం కేటాయించడం లేదు. అనేక రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తూన్నాయి. భారతదేశంలో పథకాలకు కొదువ లేదు, పైసలకు కొరత లేదు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా పథకాల పేర్లు మారుస్తున్నారు. ప్రధాన మంత్రులు, ముఖ్య మంత్రులు మారుతున్నారు. కాని ప్రజల జీవితాలు మాత్రం మారడం లేదు. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడిచినప్పటికీ సగటు భారతీయుని ప్రాథమిక హక్కులైన కూడు–, గూడు–, గుడ్డతోపాటు విద్య–, వైద్యం–, ఆరోగ్యం సమకూర్చడంలో కేంద్ర–, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్దేశ పూరిత నిర్లక్ష్య వైఖరిని అనుసరిస్తున్నాయి. సమగ్ర విద్య వైద్య– ఆరోగ్య విధానాన్ని రూపొందించడంలోను, అమలు చేయడంలోను పూర్తిగా విఫలం చెందాయి. పూర్తి నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తున్నాయి. ఓట్లు దండుకోవడంలో, సీట్లు దక్కించుకోవడంలో కనబరిచిన శ్రద్ధాసక్తులలో పది శాతం కలిగి వున్నా 'అక్షర భారత్ ఆరోగ్య భారత్' నిర్మాణం జరిగి ఉండేది. దీని పర్యవసానమే విద్య –వైద్య రంగాలలో ప్రైవేటీకరణ,– కార్పొరేటీకరణ ప్రబలంగా పెరిగి పోయింది. విద్య వైద్య రంగంలో కార్పొరేట్ విషపోకడలు మొత్తం మానవాళి మనుగడకే ప్రమాదకరంగా పరిణమించాయి. సమస్యల సాలెగూళ్ళలో చిక్కి ప్రభుత్వ విద్య– వైద్య సంస్థలు ప్రజాదరణ కోల్పోతున్నాయి. కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నామని చెపుతున్న ప్రభుత్వాలు విద్య– వైద్య సంస్థల్లో నేటికీ కనీస మౌలిక వసతులు కూడా కల్పించలేదు. కమిటీలు, కమిషన్లు వేస్తూ కడుపు నింపని సంక్షేమ పథకాలతో కాలయాపన చేస్తూ మీనమేషాలు లెక్కపెడుతున్నాయి. చిత్తశుద్ధి లోపించిన ప్రభుత్వాల పనితీరు ప్రజల పాలిటి శాపంగా మారింది. లక్షలాది మంది విద్యార్థినీ, విద్యార్థులు పోషక ఆహార లోపం, రక్తహీనత, కంటి, దంత, మూత్ర సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. సమాజ మనుగడకు విద్య, –వైద్యం,– ఆరోగ్యం అతి ప్రధానమైనవి. ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చడం ప్రజాస్వామిక ప్రభుత్వాల ప్రధాన లక్షణం. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా గొప్పలు చెప్పుకుంటున్న భారత పాలక వర్గాలు ఆచరణలో దానికి భిన్నమైన వైఖరిని కలిగి వున్నాయి. భారత దేశంలో భూస్వాములు,– పెట్టుబడిదారులు ప్రైవేట్– కార్పొరేట్ శక్తులుగా ఎదిగి పాలక వర్గాలుగా అవతరించాయి. కేంద్ర–, రాష్ట్ర ప్రభుత్వాలు పాలక వర్గ ప్రయోజనాలే ప్రథమ కర్తవ్యంగా అంతర్గత ఎజెండాను అమలు చేస్తున్నాయి. ప్రభుత్వ అనుమతితోనే విద్య– వైద్య రంగాల్లో కార్పొరేటీకరణ విష ఫలాలనందించే వటవృక్షంగా పెరిగిపోయింది. కార్పొరేట్ యాజమాన్యాలు ప్రభుత్వ పాలక వర్గంలో కీలక భాగమై కూర్చున్నాయి. విధానాల రూపకల్పనలో, అమలులో చక్రం తిప్పుతున్నాయి. ఈ వర్గాలే సేవా రంగాలైన విద్య– వైద్య రంగాలను అత్యంత లాభసాటి వ్యాపారంగా మార్చాయి. ఈ వర్గాలే ప్రజలను కార్పొరేట్ రాజకీయాల వైపు మళ్లిస్తూ ఎన్నికల ప్రక్రియను, ప్రభుత్వాలను శాసిస్తున్నాయి. కార్పొరేట్ యాజమాన్యాలు విద్యార్థులను, ఉపాధ్యాయులను, డాక్టర్లను కీలుబొమ్మల్లాగా మార్చుకున్నాయి. ప్రైవేట్, కార్పొరేట్ విద్య–వైద్య సంస్థలమధ్య నెలకొన్న తీవ్రమైన అనారోగ్యకరమైన పోటీ కారణంగా స్వార్థం, అవినీతి అక్రమాలతో కూడిన తప్పుడు విధానాలకు పూనుకుంటున్నాయి. పారిశుధ్యం, తాగునీరు, మూత్ర శాలలు, భోజన శాలలు, వంట శాలలు, పక్కా భవనాలు, ప్రహారి నిర్మాణాలు, మురుగు కాల్వలు, ఈగలు, దోమలు, శిథిలావస్థలో వున్న భవనాలు, విద్యుత్, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఫర్నీచర్, వైద్య పరికరాలు, మందులు తదితర మౌలిక వసతులు, సదుపాయాలు లేక ప్రభుత్వ విద్య– వైద్య సంస్థలు ఆదరణ కోల్పోతున్నాయి. వీటికి తోడు అరకొర నిధుల కేటాయింపు, సిబ్బంది కొరత, పర్యవేక్షణ లోపం, అవినీతి, నిర్లక్ష్యం తదితర ప్రధాన సమస్యలు ప్రభుత్వ విద్య– వైద్య సంస్థలను నిత్యం పట్టిపీడిస్తున్నాయి. సమస్యల వలయంలో చిక్కిన ప్రభుత్వ విద్య– వైద్య సంస్థలు ప్రజల విశ్వాసాన్ని, నమ్మకాన్ని కోల్పోయాయి. ఒకప్పుడు విదేశీయులు, దోపిడీ దొంగల బీభత్సంతో ప్రజలు అభద్రత భావంతో బతికేవారు. నేడు విద్య వైద్యం అందక జీవితంపై భయంతో, బెంగతో, అభద్రతా భావంతో జీవనం సాగిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 78 ఏండ్లుగా పాలక వర్గాల మోసపూరిత, కుట్ర బుద్ధితో విద్య–, వైద్య–, ఆరోగ్య, ఉపాధి అవకాశాలు సామాన్య ప్రజలకు అందకుండా పోయాయి. వలసలు, అప్పులు, ఆకలి చావులు, ఆత్మహత్యలు జరుగుతున్నాయి. ఆకలి చావులైనా, ఆత్మహత్యలైనా ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ హత్యలుగానే పరిగణించాలి. నేడు దేశంలో జరుగుతున్న రైతు ఆత్మహత్యలు, కుల వృత్తిదారుల ఆత్మహత్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల మూలంగానే ఈ ఆత్మహత్యలు జరుగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్వార్థపూరిత అనాలోచిత నిర్ణయాలు–, నిర్లక్ష్యాల మూలాలే నేటి ఆత్మహత్యలకు కారణాలు. ప్రజాద్రోహులు, పెట్టుబడిదారులు, కార్పొరేట్‌శక్తులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మమేకమవుతున్నాయి. ఇది చాలా ప్రమాదకరం. ప్రజలకు ఉపకరించే ప్రభుత్వ పథకాలను, లక్ష్యాలను నిర్వీర్యం చేస్తూ తమ వర్గ ప్రయోజనాలు కాపాడుకునే ప్రయత్నంలో భాగమే ఈ శక్తుల కలయిక. భారతదేశ ప్రజలు విజయానికి, విజయం తాలూకు ఫలాలను ఆస్వాదించడానికి మధ్య ఉన్న సంధికాలంలో ఉన్నారు. ప్రజల నోటి కాడి ముద్దను దళారులు గుంజుకునేందుకు ప్రభుత్వ విధానాలే దోహదం చేస్తున్నాయి. ప్రజాద్రోహులు, –రాజకీయ దళారులు ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేస్తున్నారు. విద్య–, వైద్యం–, ఉపాధి మొదలైన మౌలిక రంగాలలో విధానాలు రూపొందించడం,– అమలుపర్చడంలో ప్రజలు మరింత చైతన్యవంతమైన పోరాట స్ఫూర్తిని కలిగియుండాలి. విద్య వైద్య రంగాలలో కార్పొరేటీకరణ మానవజాతి మనుగడకే సమస్యగా తయారై ప్రజాజీవనానికి పెను సవాలుగా మారింది. ప్రజలందరికీ సమానమైన, నాణ్యమైన విద్య వైద్యం అందాలంటే వీటిని జాతీయాకరణ చేయడమే ఏకైక పరిష్కారం. విద్య– వైద్యం జాతీయాకరణ జరిగేంతవరకు, దోపిడీ, పీడన ఆగేంతవరకు అలుపెరగని పోరాటం చేయడమే ప్రజల ముందున్న తక్షణ కర్తవ్యం.

# ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన పూరీ జగన్నాథ రథయాత్ర

- జగన్నాథ రథయాత్ర.. చరిత్ర, ప్రాముఖ్యత గురించి తెలుసుకోండి..
- జై జగన్నాథ అంటూ భక్తుల నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగిపోతోంది.
- పురాణాల ప్రకారం గుండిచా ఆలయాన్ని స్వామి వారి జన్మస్థలంగా భక్తులు నమ్ముతారు.

**వేద న్యూస్, డెస్క్:**

ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిన పూరీ జగన్నాథ రథయాత్ర నేడు అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. దేశ విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు పూరీ క్షేత్రానికి తరలివచ్చారు. జై జగన్నాథ అంటూ భక్తుల నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగిపోతోంది. ఈ పండుగను ఏటా ఆషాడ మాస శుక్లపక్ష విదియ నాడు జరుపుతారు. ఈ 9 రోజుల ఉత్సవంలో భాగంగా, జగన్నాథ స్వామి తన సోదరుడు బలభద్రుడు, సోదరి సుభద్రతో కలిసి 12వ శతాబ్దానికి చెందిన ప్రధాన ఆలయం నుంచి గుండిచా ఆలయానికి యాత్రగా వెళ్తారు. పురాణాల ప్రకారం గుండిచా ఆలయాన్ని స్వామి వారి జన్మస్థలంగా భక్తులు నమ్ముతారు. హిందూ పవిత్ర గ్రంథాల ప్రకారం, జగన్నాథుని సోదరి సుభద్ర పూరీకి ప్రయాణించాలని కోరుకుందని చెబుతారు. దేవి సుభద్ర కోరికను తీర్చడానికి, జగన్నాథుడు, అతని అన్నయ్య బలభద్రుడు పూరీకి రథం నడిపారు. పూరీ జగన్నాథ రథయాత్ర ప్రస్తావన బ్రహ్మ పురాణం, పద్మ పురాణం వంటి పురాతన గ్రంథాలలో ఉంది. ఇది 460 సంవత్సరాలకు పైగా పురాతనమైనదని నమ్ముతారు. జగన్నాథ రథయాత్ర గురించి అనేక ఇతిహాసాలు ఉన్నప్పటికీ, ప్రసిద్ధమైన వాటిలో ఒకదాని గురించి తెలుసుకుందాం.. పూరి జగన్నాథ ఆలయాన్ని ఇంద్రద్యుమ్న రాజు నిర్మించాడు. జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర విగ్రహాలను గుండిచ ఆలయంలో విశ్వకర్మ తయారు చేశాడు. రాణి గుండిచ ఇంద్రద్యుమ్న భార్య. రాణి గుండిచకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం, ప్రతి సంవత్సరం రథయాత్ర సమయంలో దేవతలు గుండిచా ఆలయం సందర్శిస్తారు. పురాణాల ప్రకారం, ఇంద్రద్యుమ్న రాజుకు ఒక కల వచ్చింది. అందులో జగన్నాథుడు కనిపించి ఒడ్డున దొరికే చెక్క దుంగ నుండి తన విగ్రహంను తయారు చేయాలని కోరుకున్నాడు. రాజు ఆ దుంగను చూసి విగ్రహాలను చెక్కడానికి తగిన మనిషి కోసం ఎదురు చూస్తున్నాడు. అయితే, అతనికి తగిన వారు ఎవరూ దొరకలేదు. అప్పుడే, విశ్వకర్మ విగ్రహాలను తయారు చేయడానికి అంగీకరించాడు. కానీ, అతను ఒక షరుతు పెట్టాడు. అతను తయారుచేసేటప్పుడు ఎవరు విగ్రహాలను చూడకూడదని, తలుపులు మూసివున్న గదిలో విగ్రహాలను తయారు చేస్తానని, విగ్రహాలు పూర్తయ్యే వరకు ఎవరినీ లోపలికి అనుమతించనని చెప్పాడు. అయితే, రాజు మొదట్లో అంగీకరించాడు. కానీ, తరువాత ఆందోళన చెంది తలుపు తెరిచాడు. దీంతో విశ్వకర్మకు కోపం వచ్చి ఆ ప్రదేశం నుండి వెళ్లిపోయాడని, అలా విగ్రహాలు అసంపూర్ణంగా మిగిలిపోయాయని పురాణాలు చెబుతున్నాయి. అయితే, విగ్రహాలు అసంపూర్ణంగా ఉన్నప్పటికీ, నేటికీ వాటిని ఆ రూపంలోనే పూజిస్తున్నట్లు తెలుస్తోంది.



# హైకోర్టు న్యాయమూర్తి బెడ్‌రూమ్ నుంచి బంగారం చోరీ

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**




హైకోర్టు న్యాయమూర్తి బెడ్‌రూమ్ నుంచి బంగారం చోరీ అయ్యింది. అత్యంత భద్రత ఉండే జడ్జి నివాసంలో ఈ దొంగతనం జరిగిన విషయం తెలుసుకుని పోలీసులు షాక్ అయ్యారు. ఆ న్యాయమూర్తి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కేరళలోని కొచ్చిలో ఈ సంఘటన జరిగింది. కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ బధరుద్దీన్ నివాసంలో గురువారం చోరీ జరిగింది. ఆయన బెడ్‌రూమ్‌లోని లాకర్‌లో ఉంచిన సుమారు 44 గ్రాములున్న ఆరు బంగారు గోల్డ్ కాయిన్స్ మాయమయ్యాయి. ఈ నేపథ్యంలో తన నివాసం పరిధిలోని కలమస్సేరి పోలీస్ స్టేషన్‌లో ఆ జడ్జి ఫిర్యాదు చేశారు. కాగా, అత్యంత సెక్యూరిటీ ఉండే న్యాయమూర్తి నివాసంలో గోల్డ్ చోరీ జరుగడంపై పోలీసులు షాక్ అయ్యారు. జడ్జి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీనియర్ న్యాయమూర్తి బెడ్ రూంలో ఈ సంఘటన జరుగడంతో ప్రశ్నించాల్సిన వ్యక్తుల జాబితాను సిద్ధం చేస్తున్నారు.

# న్యాయ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం

- ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు
- ఈ ఘటనపై బీజేపీ తీవ్ర స్థాయిలో స్పందించింది.

**వేద న్యూస్, డెస్క్:**

పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్‌కతాలో మరో దారుణ ఘటన చోటు చేసుకుంది. కస్బా పరిసరాల్లో ఓ న్యాయ విద్యార్థిని పై సామూహిక అత్యాచారం జరిగింది. బుధవారం రాత్రి 7:30 నుంచి 8:50 గంటల మధ్య కాలేజ్ క్యాంపస్ లో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటి వరకూ ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టైన వారిలో ఇద్దరు విద్యార్థులు కాగా, మరో వ్యక్తి కళాశాల సిబ్బందిగా పేర్కొన్నారు. ఈ ఘటనపై కోల్‌కతా మేయర్ ఫిర్హాద్ హకీమ్ విలేకరులతో మాట్లాడుతూ.. ఇది చాలా తీవ్రమైన సంఘటన అని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఇంకా పూర్తి సమాచారం తనకు అందలేదని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరోవైపు ఈ ఘటనపై బీజేపీ తీవ్ర స్థాయిలో స్పందించింది. ఈ మేరకు రాష్ట్రంలోని మమతా బెనర్జీ నేతృతంలోని తృణమూల్ ప్రభుత్వంపై విమర్శలు చేసింది. రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినులకు భద్రత కరవైందని ధ్వజమెత్తింది. కాగా, 2024 ఆగస్టు 9న కోల్‌కతాలోని ఆర్‌జీకార్ ఆసుపత్రిలో సెమినార్ రూమ్‌లో ఒంటరిగా నిద్రిస్తున్న జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం కాగా ఆర్‌జీకార్ దవాఖాన డాక్టర్లు, వైద్య విద్యార్థులు సుదీర్ఘకాలం ఆందోళనలు నిర్వహించారు. ఘటన అనంతరం ఆసుపత్రి ఆవరణలోని సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా సంజయ్‌ను ఆగస్టు 10న కోల్‌కతా పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఈ కేసును సీబీఐ విచారించింది. ప్రధాన నిందితుడిగా సంజయ్ రాయ్ పేరును ఛార్జ్‌షీట్‌లో చేర్చి కోర్టుకు సమర్పించింది. దీనిపై విచారణ జరిపిన కోల్‌కతాలోని సీల్దా కోర్టు.. సంజయ్ రాయ్‌ని దోషిగా నిర్ధారించింది. ఈ మేరకు దోషికి జీవితఖైదు విధించింది. ఈ ఘటన మరవకముందే ఇప్పుడు మరో విద్యార్థినిపై అత్యాచారం ఘటన వెలుగు చూడటం ఆందోళన కలిగిస్తోంది.





# భారీ వర్షాలకు కుప్పకూలిన భవనం..



**వేద న్యూస్, డెస్క్:**

దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు వరదలు సంభవిస్తున్నాయి. తాజాగా కేరళలో భారీ వర్షాల కారణంగా రెండంతస్తుల భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ముగ్గురు వలస కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. త్రిస్సూర్ లోని కొడకరాలో శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. ఉదయం 6 గంటల ప్రాంతంలో వలస కార్మికులు నివసిస్తున్న రెండంతస్తుల పాత భవనం కూలిపోయింది. ఉదయం చాలా మంది కార్మికులు పనికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఆ సమయంలో భవనం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు కార్మికులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో రాహుల్ (19), రూపేల్ (21), అలీమ్ (30) మరణించారు. మృతులు పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారిగా అధికారులు గుర్తించారు. ప్రమాద సమయంలో అందులో దాదాపు 17 మంది కార్మికులు ఉన్నట్లు తెలుస్తోంది. 14 మంది ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నట్లు సమాచారం.

# విష ప్రయోగం.. ఐదు పులులు మృతి

**వేద న్యూస్, డెస్క్:**

కరళ సరిహద్దుల్లో ఐదు పులులు మరణించాయి. మలై మహదేశ్వర వైల్డ్ లైఫ్ డివిజన్ లో తల్లి పులి, నాలుగు కూనలు మరణించాయి. వాటికి సమీపంలో ఓ ఆవు కళేబరాన్ని అధికారులు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు విషం పెట్టడం వల్లే ఈ పులులు మృతి చెందినట్లు తెలుస్తోంది . టైగర్ రిజర్వ్ లోపల పశువులను మేపుతున్న స్థానిక ప్రజల పనే అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చనిపోయిన పులి కొన్ని రోజుల క్రితం ఒక ఆవును చంపినట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఆ పగతోనే సమీప గ్రామస్థులు ఆవు కళేబరంలో విషం కలిపి పులికి ఎర వేసి ఉంటారని భావిస్తున్నారు. ఆ కళేబరం తిన్న పులులు చనిపోయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. శవపరీక్షలో కూడా విష ప్రయోగం వల్లే చనిపోయినట్లుగా తేలిందని చెప్పారు. రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించారు. మూడు రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కాగా, ప్రస్తుతం కర్ణాటకలో 563 పులులు ఉన్నాయి. మధ్యప్రదేశ్ తర్వాత దేశంలో రెండో స్థానంలో పులుల సంఖ్య కర్ణాటకలోనే ఉంది. ప్రభుత్వ స్థాయిలో పులుల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు తమ పశు సంపదను కాపాడుకోవడానికి మృగాలపై విషప్రయోగానికి వెళు_్తన్నట్లు అటవీ శాఖ గుర్తించింది.

# సైబర్ నేరాలపై అవగాహన అవసరం

మొదటి పేజీ తరువాయి

పరిమితికిమించి వాడకూడదని సూచించారు. సైబర్ నేరగాళ్లు రోజుకో రీతిలో ప్రజలను మోసం చేసి, డబ్బులు కాజేస్తున్నారన్నారు. మహిళలు, బాలికలు వేధింపులకు గురైతే 100,181,మహిళల హెల్ప్ లైన్ నెంబర్ 1098లను, వరంగల్ షీ టీమ్ నెంబర్ 8712685142 కి సమాచారం ఇవ్వాలన్నారు.సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని సీఐ సుజాత తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్ పీటర్స్ ఫార్మసీ కళాశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు షీ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సుల దరఖాస్తులు పరిష్కారమయేనా..!

స్తులపై దృష్టి పెట్టారు. జిల్లావ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులపై తహసీల్దారులు పరిష్కరించే విధంగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా గతంలో రైతులు ఎన్నో ఏళ్లుగా భూ సమస్యల పరిష్కారం కోసం తసిల్దారులకు దరఖాస్తు చేసుకున్నారు. కాగా వాటి పరిష్కారం రెవెన్యూ సదస్సులోనైనా పరిష్కారం అవుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూభారతి రెవెన్యూ సదస్సులో మరొకసారి దరఖాస్తు చేసుకున్నారు. రైతుల భూ సమస్యలు పరిష్కారం అవుతాయో...కాదో అని జిల్లా వ్యాప్తంగా రైతులు చర్చించుకుంటున్నారు. అయితే ఇప్పటికే జిల్లా కలెక్టర్ భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని తసిల్దారులకు ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా ఎక్కువగా సర్వేనెంబర్ మిస్సింగ్ కేసులు, భూ విస్తీర్ణం హెచ్చు తగ్గుదల, సరిహద్దు భూ వివాదాలు, సాదా బైనామీలు దరఖాస్తులు వచ్చినట్లు విశ్వసనియ సమాచారం ద్వారా తెలుస్తుంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులపై తాసిల్దారులు దృష్టి సారిస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలు తూచా తప్పకుండా తహసిల్దార్లు వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉండగా జిల్లా వ్యాప్తంగా సర్వేల కొరత వెంటాడుతుంది. జిల్లాలో పలువురు రైతులు హెచ్చు తగ్గుదల కోసం మీ సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో 33 మండలాల్లో దాదాపు 20 మంది సర్వేలు మాత్రమే అందుబాటులో ఉండడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాటిని పరిష్కరించే సర్వేలు ఎప్పుడు వస్తారో రారో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా ఉన్న ఆర్ఐల పైన రెవెన్యూ సదస్సుల నేపథ్యంతో అదనపు భారం పడుతుంది. ఇప్పటికే రెవెన్యూ కార్యాలయంలో ఉన్న పని భారంతో ఇబ్బందులు పడుతున్న ఆర్ఐలు భూభారతి రెవెన్యూ సదస్సుల పరిష్కారానికి పనులు అదనపు భారం మోపాయి. ముఖ్యంగా పాఠశాలలు పున ప్రారంభం, కళాశాలల ప్రారంభం నేపథ్యంతో కులం, ఆదాయం సర్టిఫికెట్లు,రేషన్ కార్డులు దరఖాస్తుల పరిశీలనతో పాటు భూ సంబంధిత సమస్యల పరిష్కారంలో వారిపై పని ఒత్తిడి పడే అవకాశం లేకపోలేదు.

# మామ కిరాతకం, కోడలిపై అత్యాచారం, హత్య



**వేద న్యూస్, డెస్క్:**

కోడలికి భోజనంలో మత్తుమందు కలిపి, ఆపై అత్యాచారం చేసి చంపేసిన ఒక మామ కిరాతకం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 24 ఏళ్ల మహిళ హత్యకు సంబంధించి విస్తుగొలిపే విషయాలు బయటపడ్డాయి. ఏప్రిల్‌లో కోడలి హత్య జరగ్గా, ఆమె అత్తమామలు.. తమ కోడలు తప్పిపోయిందని ఫిర్యాదు చేయడంతో దాదాపు రెండు నెలలుగా ఆమె ఆచూకీ కోసం పోలీసులు గాలించారు. ఫిరోజాబాద్ జిల్లాలోని షికోహాబాద్‌కు చెందిన బాధితురాలు, జూలై 2023లో ఫరీదాబాద్‌లో వివాహం చేసుకుంది. పోలీసులు చెబుతున్న వివరాల ప్రకారం, కస్టడీలో హతురాలి మామ తన నేరాన్ని ఒప్పుకున్నాడు. ప్రస్తుతం నిందితుడు మూడు రోజుల రిమాండ్‌లో ఉన్నాడు. కాగా, కోడలిని చంపే ప్లాన్ ఏప్రిల్ 14, 2025న ఖరారు చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. పక్కా ప్లాన్‌లో భాగంగా, ఆమె అత్తగారిని ఉత్తరప్రదేశ్‌లోని ఎటాలో జరిగిన వివాహానికి హాజరు కావడానికి పంపారు. ఏప్రిల్ 21 రాత్రి, బాధిత మహిళ భర్త ఆమెకు, అతని చెల్లికి ఆహారంలో నిద్రమాత్రలు కలిపాడని పోలీసులు చెబుతున్నారు. దీంతో వేర్వేరు అంతస్తులలోని గదుల్లో నిద్రిస్తున్న ఇద్దరు మహిళలు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. ఈ క్రమంలో మామ అనుకున్నట్టుగా, అర్థరాత్రి రహస్యంగా కోడలి గదిలోకి వెళ్లాడు. హత్యకు ముందు అతను అపస్మారక స్థితిలో ఉన్న తన కోడలిపై అత్యాచారం చేశాడని పోలీసులు చెబుతున్నారు. అయితే, అత్యాచారం విషయాన్ని మామ.. తన కొడుకు, భార్యతో చెప్పలేదని పోలీసులు అంటున్నారు. హత్య తర్వాత, మామ తన కొడుకును మేడమీదకు పిలిచాడు. వారిద్దరూ కలిసి ఆ మహిళ మృతదేహాన్ని చుట్టి, ఇంటి వెలుపల ఉన్న వీధిలో అప్పటికే తవ్విన గొయ్యిలో పడేశారు. ఇరుగుపొరుగు వారంతా డ్రైనేజ్ పనుల్లో భాగంగా తవ్విన గుంతగా మాత్రమే దానిని భావించారు. తర్వాత మట్టి, ఇటుకలు వేసి కొన్ని రోజుల తర్వాత దానిపై కాంక్రీట్ స్లాబ్ వేసేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆ గుంతను తవ్వి, పాక్షికంగా కుళ్ళిపోయి ఉన్న మహిళ మృతదేహాన్ని బయటకు తీసి పోస్ట్ మార్టం కోసం పంపిచారు. మామ, అత్త, భర్తతో పాటు, బాధితురాలి వదిన, నిందితులుగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇక, బాధితురాలి సోదరి చెబుతున్న వివరాల ప్రకారం.. పెళ్లైన నాటి నుంచీ అధిక కట్నకానుకల కోసం అత్తమామలు తమ సోదరిని తీవ్ర వేధింపులకు గురిచేశారని చెప్పింది. ఆ బాధలు భరించలేక పెళ్లైన తర్వాత ఏడాది పాటు, తన అక్క పుట్టింటిలోనే ఉండిపోయిందని వాపోయింది. ఈ ఆరోపణల నేపథ్యంలో పోలీసులు ఈ కేసును వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

# రైతుల కోసం న్యాయపోరాటం

మొదటి పేజీ తరువాయి

తీసుకొని రాలేదని అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ముఖ్యమంత్రి, తాను నీటిపారుదల శాఖ లో జరిగిన తప్పిదాలను ఒక్కొకటి సరి చేసుకుంటూ.. కాళేశ్వరం నీరు ఇవ్వకున్నా.. తెలంగాణ లో ఖరీఫ్, రబీ సీజన్ లలో కలిపి 281 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పడించి దేశం లోనే తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందని చెప్పారు. అలాగే ముందస్తుగా రైతులకి పెట్టుబడి కోసం 9 రోజులలో 9000 కోట్లు రైతు భరోసా కింద వేయటం జరిగిందని తెలిపారు.

**- కాంట్రాక్టర్ పై మంత్రి ఆగ్రహం**

జవహర్ జానపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పనులు యుద్ధ ప్రాతిపదికన వేగవంతంగా, నాణ్యత పాటిస్తూ పూర్తి చేయాలని మంత్రి కాంట్రాక్టర్ ని ఆదేశించారు. పనులు చాలా నెమ్మదిగా జరుగుతున్నాయని ఇప్పటికే మూడు సార్లు సందర్శించిన పనులలో పురోగతి లేదని కాంట్రాక్టర్ పై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు జానపాడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ను 302 కోట్ల రూపాయలతో నిర్మించటం జరుగుతుందని దీని ద్వారా అలింగాపురం, రాఘవపురం, బొత్తలపాలెం, కోమటికుంట,మీగడం పాడు తండా, చెరువు తండా, హనుమాయగూడెం,పాలకీడు, సజ్జాపురం, నాగిరెడ్డి గూడెం గ్రామాలలోని 10,000 ఎకరాలకి సాగునీరు అలాగే జానపాడు చెరువు కి నీరు అందించటం జరుగుతుందని తెలిపారు. డిజైన్ లో ఏమైనా మార్పులు ఉంటే సి డి ఓ(సర్కులర్ డిజైన్ ఆపరేషన్) సి ఈ ద్వారా చేసుకోవాలని కాంట్రాక్టర్ కి సూచించారు.లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పైప్ లైన్ పనులు ఒకే సారి నిర్మించి త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులో కి తీసుకొనిరావాలని సూచించారు.తదుపరి 33.83 కోట్లతో నిర్మించే బెట్టే తండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులు పరిశీలించారు.ఈ ప్రాజెక్ట్ ద్వారా బెట్టేతండా, సజ్జాపురం, పాడియా తండా ల గిరిజన రైతులకి చెందిన 2041 ఎకరాలు ఆయకట్టు సాగులోకి రావటం జరుగుతుందని తెలిపారు. అలాగే మూసి నదిలో నీరు ఉండేలా 10.50కోట్ల రూపాయలతో చెక్ డ్యామ్ నిర్మిస్తున్నామని తెలిపారు. పనులు వేగవంతంగా, నాణ్యత పాటిస్తూ పూర్తి చేసి సెప్టెంబర్ నాటికి నీరు అందించాలని కాంట్రాక్టర్ కి, అధికారులకి మంత్రి ఆదేశించారు.జానపాడు, బెట్టే తండా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్ పూర్తి అయితే పాలకీడు మండలం సస్యశ్యామలం, సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమం లో ఎస్పి నరసింహ, సి డి ఓ సి ఈ ,ఆర్డీవో శ్రీనివాసులు,ఇరిగేషన్ సి ఈ రమేష్ బాబు, ఎస్ ఈ శివ ధర్మ తేజ, డి ఈ నవికాంత్, హరి కిషోర్,ఏఈ సతీష్ కాంట్రాక్టర్ శ్రీనివాస్,హన్మంత్ రామ్, నాగరాజు,అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు ఇవ్వాలి

మొదటి పేజీ తరువాయి

రూ.2లక్షల 35 వేలు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తున్నదని వివరించారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని.. కేవలం కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకే కాకుండా ప్రతి పేద కుటుంబానికి ఇండ్లు మంజూరు అయ్యేలా చూడాలని కోరారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలోనైనా అవకతవకలు జరగకుండా నిరుపేద కుటుంబానికి న్యాయం జరిగేలా ఇల్లు చేకూర్చాలని బీజేపీ తరఫున డిమాండ్ చేశారు. అనంతరం ఈ మేరకు ఎంపీడీవో కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కంచర్ల శంకరయ్య, వెంకటేష్, మధుకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# హిమాచల్ ప్రదేశ్‌లో ఆకస్మిక వరదలు

**వేద న్యూస్, డెస్క్:**



దేశంలోని పలు రాష్ట్రాలను వరదలు ముంచెత్తాయి. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో వరద బీభత్సం సృష్టించింది. హిమాచల్ ప్రదేశ్‌లో ఆకస్మిక వరదలు సంభవించాయి . కాంగ్రా , కులు జిల్లాల్లో సంభవించిన ఈ వరదల కారణంగా ఐదుగురు మరణించారు. ధర్మశాల లోని కొన్ని ప్రాంతాలను కూడా వరదలు చుట్టుముట్టాయి. ఈ ఆకస్మిక వరదల్లో అనేక మంది కొట్టుకుపోయినట్లు కాంగ్రా పోలీసు సూపరింటెండెంట్ షాలిని అగ్నిహోత్రి తెలిపారు. ఎస్‌డీఆర్ఎఫ్, స్థానిక పోలీసులు రంగంలోకి దిగినట్లు చెప్పారు. వరదలో కొట్టుకుపోయిన వారి కోసం గాలింపు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకూ దాదాపు 250 మందికిపైగా ప్రజలను సురక్షితంగా రక్షించినట్లు తెలిపారు. 'కొందరు ఆకస్మిక వరదల్లో కొట్టుకుపోయారు. నిన్న ఎస్‌డీఆర్ఎఫ్, స్థానిక పోలీసులు, హిమాచల్ ప్రదేశ్ హోమ్ గార్డ్ వాలంటీర్లు సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. దాదాపు 250 మందిని రక్షించగలిగారు. నిన్న రెండు మృతదేహాలను వెలిగితీగా.. ఇవాళ మూడు మృతదేహాలను వెలికితీశారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి' అని షాలిని అగ్నిహోత్రి వెల్లడించారు.

# చైనాతో భారత్ కీలక ఒప్పందం..!

**- ఆరేళ్ల తరువాత తెరుచుకోబోతున్న కైలాష్ మానసరోవర్ యాత్ర.. చైనాతో రాజ్‌నాథ్ చర్చలు!**

**- చైనా మధ్య సానుకూల సంభాషణ**

**వేద న్యూస్, డెస్క్:**



చైనాలోని కింగ్‌డావో నగరంలో జరిగిన (షాంఘై సహకార సంస్థ) రక్షణ మంత్రుల సమావేశంలో భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చైనా రక్షణ మంత్రి అడ్మిరల్ డాంగ్ జున్‌తో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక ప్రత్యేక నిర్ణయంపై రెండు దేశాలు అంగీకారానికి వచ్చాయి. దాదాపు ఆరు సంవత్సరాల తర్వాత కైలాష్ మానసరోవర్ యాత్ర తిరిగి ప్రారంభమవుతుందని రాజ్‌నాథ్ సింగ్ సోషల్ మీడియా వేదికగా తెలిపారు. ఈ విషయంలో భారతదేశం– చైనా మధ్య సానుకూల సంభాషణ జరిగింది. సమానత్వం, సంప్రదింపులు, పరస్పర ప్రయోజనం, ప్రాంతీయ బహుపాక్షిక సహకారం షాంఘై స్ఫూర్తిని కొనసాగిస్తుందని చైనా రక్షణ మంత్రి అడ్మిరల్ డాంగ్ జున్ అన్నారు. ఇది సభ్య దేశాలకు ఉమ్మడి ప్రయోజనాలపై సహకారాన్ని పెంచడానికి, పరస్పర విశ్వాసాన్ని బలోపేతం చేయడానికి అవకాశాన్ని ఇచ్చే వేదిక అన్నారు. పరస్పర సహకారాన్ని మరింతగా పెంచడంతో పాటు వ్యూహాత్మక పరస్పర విశ్వాసాన్ని కూడా పెంచుతుందని డాంగ్ జున్ అభిప్రాయపడ్డారు. భారత్–పాకిస్తాన్ మధ్య విభేదాలను పరిష్కరించడానికి %ాజా% సమావేశ ఒక వేదిక కాదని, ద్వైపాక్షిక చర్చల మార్గం మాత్రమే అని చైనా పేర్కొంది. భారతదేశం–పాకిస్తాన్ మధ్య చాలా కాలంగా ఉన్న విభేదాలు అందరికీ తెలిసినవేనని, ప్రాంతీయ శాంతి కోసం ద్వైపాక్షిక మార్గాల ద్వారా ఇటువంటి సమస్యలను పరిష్కరించుకోవాలని సభ్యులు పిలుపునిచ్చారు. ఉగ్రవాదంపై తన వైఖరిపై భారతదేశం జారీ చేసిన ఉమ్మడి ప్రకటనపై సంతకం చేయలేదని కొన్ని భారతీయ మీడియాలో వార్తలు వచ్చాయని చైనా పేర్కొంది. ఇది బహుపాక్షిక వేదిక, ఏకాభిప్రాయం లేకుండా ఉమ్మడి ప్రకటన సాధ్యం కాదు, కాబట్టి దీనిని భారతదేశం–పాకిస్తాన్ ద్వైపాక్షిక సమస్యతో ముడిపెట్టడం సరైనది కాదని చైనా పేర్కొంది. పహల్గామ్ దాడిపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని తీవ్రంగా విమర్శించారు. జాయింట్ డ్రాఫ్ట్‌పై సంతకం చేయడానికి రక్షణ మంత్రి నిరాకరించారు. "మన ప్రాంతంలో అతిపెద్ద సవాళ్లు శాంతి, భద్రత, విశ్వాసం లేకపోవడంతో ముడిపడి ఉన్నాయని నేను నమ్ముతున్నాను. ఈ సమస్యలకు మూల కారణం తీవ్రవాదం, ఉగ్రవాదం పెరగడం. శాంతి, శ్రేయస్సు, ఉగ్రవాదం కలిసి ముందుకు సాగలేవు. ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి నిర్ణయాత్మక చర్య అవసరం. మన సమిష్టి భద్రత కోసం ఈ దుష్టశక్తులకు వ్యతిరేకంగా మన పోరాటంలో మనం ఐక్యంగా ఉండాలి" అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.ద్వైపాక్షిక సంబంధాలకు సంబంధించిన అంశాలపై చైనాతో నిర్మాణాత్మక, దార్శనిక అభిప్రాయాలను మార్పిడి చేసుకున్నాము. దాదాపు ఆరు సంవత్సరాల విరామం తర్వాత కైలాష్ మానస సరోవర్ యాత్ర తిరిగి ప్రారంభించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశాము" అని రాజ్‌నాథ్ సింగ్ రాశారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073